

ఇళ్ల మధ్య మద్యం దుకాణం వద్దు

చల్లమాంబాపురం మహిళల నిరసన

ప్రజాశక్తి - బిఎన్ కండ్రిగ

మండలంలోని చల్లమాంబపురం గ్రామంలో నిబంధనలకు విరుద్ధంగా మద్యం షాపును ఏర్పాటు చేయటంపై సోమవారం మహిళలు నిరసన తెలిపారు. గ్రామంలో రోడ్డు పక్కనే మద్యం షాపును పెట్టటంతో అటువైపు నడచి వెళ్లాలంటేనే పిల్లలు, మహిళలు ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. మందు బాబులు మద్యం మత్తులో గొడవలు చేస్తూ, ప్రశాంతత లేకుండా చేస్తున్నారని వాపోయారు. రాత్రి సమయంలో నిద్ర పోకుండా మందుబాబులు గ్రామాలలో వీరంగం చేస్తున్నారని, ఇళ్లమధ్య మద్యం దుకాణాన్ని ఎత్తివేయాలని కోరారు.



వినతి ఇస్తున్న 'ఆప్కాస్' నేతలు

ప్రజా సమస్యల వేదిక... పరిష్కరించాలి మీరిక..!

సోమవారం 280 అర్జీలు

ప్రజాశక్తి - తిరుపతి (మంగళం)

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 280 అర్జీలు అందాయి.. అత్యధికంగా రెవెన్యూ శాఖకు సంబంధించి 163 ఉన్నాయి. డిప్యూటీ కలెక్టర్లతో కలిసి అర్జీలను స్వీకరించారు. గడువులోపు పరిష్కారం చూపాలని జిల్లా రెవెన్యూ శాఖ అధికారి నరసింహులు ఆదేశించారు.

ఆటో మరమ్మతు రిపేరు షెడ్లు ఇవ్వాలి : సురేష్, ఆటో మెకానిక్ యూనియన్ అధ్యక్షులు

నిరుద్యోగులు జీవనభృతి కోసం ఆటోరంగాన్ని ఎంచుకుని, ఆటోలు రిపేరు చేసుకుంటూ దాదాపు 100 మంది ఉన్నారు. అయితే వాహనాలు రిపేరు చేయడం వల్ల నగర పాలక అధికారులు, పోలీసులు, చుట్టుపక్కల ప్రజలు శబ్దకాలుష్యం పేరుతో అభ్యంతరం చెబుతూ షెడ్ల నిర్మాణం వేరేచోట చేసుకోవాలని సూచిస్తున్నారన్నారు. జిల్లా అధికారులు స్పందించి వాహనాల మరమ్మతులు చేసుకునే మెకానిక్‌లకు ఎపిఐఐసి ద్వారా షెడ్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. దామినేడు, మంగళం ప్రాంతాల్లో స్థలాలు కేటాయించాలని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర ఆటో మెకానిక్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు సురేష్ విజ్ఞప్తి చేశారు.

ప్రిన్సిపాల్ రేష్మా రెడ్డిపై చర్యలు తీసుకోవాలి : కె.చంద్రశేఖర్, ఎస్ఎంసి ఛైర్మన్

ఎంజెపిఎపిబిసిడబ్ల్యు ఆర్ బాలికల గురుకుల పాఠశాల(ఉదయమాణిక్యం) ప్రిన్సిపాల్ రేష్మా రెడ్డి అక్కడి పిల్లలను కులం పేరుతో దూషిస్తున్నారు. ఎస్ఎంసి ఛైర్మన్ గా ఆమె ప్రవర్తన గమనించి పలు మార్లు వివరణ కోరగా లెక్కచేయడం లేదు. ఎస్ఎంసి కమిటీ తీర్మానం లేకుండా విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి డబ్బులు వసూలు చేయడం, విద్యార్థులకు కేటాయించిన గదుల్లో హెచ్ఆర్ఏ తీసుకునే ఉపాధ్యాయులు ఉంటూ విద్యార్థులను మరుగుదొడ్ల సమీపంలో ఉంచారు. దీనిపై సంబంధిత శాఖాధికారులు ప్రిన్సిపాల్ రేష్మా రెడ్డిపై కఠిన చర్యలు తీసుకోవాలి.

జీవో నెంబర్ 2ను రద్దు చేయాలి ప్రభాకర్‌రెడ్డి, ఆప్కాస్ ఉద్యోగి

చాలీచాలని వేతనాలతో జీవనం సాగిస్తున్నాము. ఆప్కాస్ వలన అంతో ఇంతో మేలు జరుగుతోంది అనుకుంటే అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం అసెంబ్లీ వేదికగా ఆప్కాస్ ను రద్దు చేస్తామని ప్రకటించడం అనాలోచితం నిర్ణయం. మినిమం టైం స్కేల్ అమలు చేస్తూ ఆప్కాస్ ను రద్దు చేయకుండా ఉండాలి. దీనిపై ఇప్పటికే నాలుగుసార్లు జిల్లా కలెక్టర్ కు అర్జీలు ఇచ్చాము.

ఆప్కాస్ రద్దు తీవ్రమైన చర్య : చిన్నబాబు, రాష్ట్ర అధ్యక్షులు

రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఆప్కాస్ రద్దు చేస్తామని చెప్పడాన్ని తీవ్రమైన చర్యగా పరిగణిస్తాం. ఆప్కాస్ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా లక్ష 28 వేల మంది ఉద్యోగులు సకాలంలో జీతాలు తీసుకుంటున్నారు. ఒకవేళ ఆప్కాస్ రద్దు చేసే పరిస్థితి వస్తే మినిమం టైమ్ స్కేల్, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలి. ఆప్కాస్ రద్దుతో తిరోగమనం ఆలోచన చేయడం మంచి పద్ధతి కాదు. రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయాన్ని తక్షణమే వెనక్కు తీసుకోవాలి.

ఆటోడ్రైవర్లపై తాళ్లపాక దాము దౌర్జన్యం

ప్రజాశక్తి - తిరుపతి సిటి

చింతలచేనుకు చెందిన తాళ్లపాక దాము, అతని అనుచరులు ఆటోడ్రైవర్లపై దౌర్జన్యం చేయడంతో బెదిరిస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారని కలెక్టరేట్ ఎదుట ఆటోడ్రైవర్లు సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. తాళ్లపాక దాము దాడుల నుంచి తమను కాపాడాలని నినాదాలు చేశారు. జయశ్యాం థియేటర్ ముందు గత 35 ఏళ్లుగా ఆటోలు నడుపుకుంటూ వీరు జీవనాన్ని గడుపుతున్నారు. సిఐటియు నేతలు టి.సుబ్రమణ్యం, కె.వేణుగోపాల్, ఆర్.లక్ష్మి, పి.బుజ్జి, ఆటోడ్రైవర్లు మురళి, జయరాజ్, శంకర్ మాట్లాడుతూ గతంలో రెండుసార్లు కొట్టడం, సొంత పనులకు ఉపయోగించుకుంటూ డ్రైవర్లను ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. కొద్దిరోజులుగా తాము అతను చెప్పిన పనులు చేయకపోవడంతో ఆటోస్టాండ్ ఖాళీ చేయాలని దౌర్జన్యం చేస్తున్నారన్నారు. తాళ్లపాకదాము నుంచి తమకు ప్రాణహాని ఉందని జీడీనెల్లూరు విచ్చేసిన సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబుకు వినతిపత్రం ఇచ్చామన్నారు. సోమవారం డిఆర్‌ఒకు వినతిపత్రం ఇచ్చారు. ఆటో యూనియన్ నాయకులు వెంకటరమణ, వరాలు, హరిబాబు, భాస్కర్‌యాదవ్, దాము, వెంకటాచలపతి, జి.శేఖర్‌బాబు, ఎండి గౌస్‌భూపాల్, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

తిరుపతి కార్పొరేషన్‌కు 52 వినతులు

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 52 వినతులు వచ్చాయని కమిషనర్ ఎన్.మౌర్య తెలిపారు. ఫోన్ ద్వారా 18 మంది తమ సమస్యలు తెలుపగా, 34 మంది నేరుగా వచ్చి వినతులు సమర్పించారు. డిప్యూటీ మేయర్లు ముద్ర నారాయణ, ఆర్.సి. మునికృష్ణ పాల్గొనగా కార్పొరేటర్ నరసింహ ఆచారి సమస్యలు పరిష్కరించాలని కమిషనర్ కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్ ఉన్నారు.

పారిశుధ్య పనులు పరిశీలన

తిరుపతి నగరంలో జరుగుతున్న పారిశుధ్య పనులను సోమవారం ఉదయం అధికారులతో కలసి 26వ వార్డులో కమిషనర్ పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రజలు ఎక్కువగా సంచరించే రైల్వే స్టేషన్, తదితర ప్రాంతాల్లో ప్రజా మరుగుదొడ్లు శుభ్రంగా ఉంచాలని అన్నారు. రోడ్లపై ఉన్న చిన్న చిన్న గుంతలను కూడా వెంటనే పూడ్చాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు.

తమకు రక్షణ కల్పించాలని ఆటో కార్మికుల వినతి

ఢిల్లీలో జంతర్‌మంతర్ వద్ద జరిగిన ధర్నాలో పాల్గొన్న తిరుపతి జిల్లా బ్యాంకు ఉద్యోగులు

బ్యాంకు ఉద్యోగుల సమ్మెకు సిఐటియు మద్దతు

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

మార్చి 24, 25 తేదీలలో దేశవ్యాప్తంగా బ్యాంకు ఉద్యోగులు చేపట్టిన రెండు రోజుల సమ్మెకు సిఐటియు సంపూర్ణ మద్దతు ఇస్తోందని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి ఓ ప్రకటనలో తెలిపారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం పథకం ప్రకారం ప్రభుత్వరంగ సంస్థలను నిర్వీర్యం చేస్తోందన్నారు. తాజా బడ్జెట్లో ఇన్సూరెన్స్ రంగంలో వందశాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు అవకాశం ఇస్తూ గొంతు కోయడానికి ప్రయత్నిస్తోందని గుర్తు చేశారు. సంస్కరణల పేరిట బ్యాంకులను ముంచేసే కార్యక్రమాన్ని దశాబ్దకాలంలో మోడీ ప్రభుత్వం నిర్లజ్జగా కొనసాగించిందని ఆరోపించారు. కార్పొరేట్లకు మొండి బకాయిల పేరిట లక్షల కోట్ల రూపాయల రుణాలు రద్దు చేసి బ్యాంకులు దీనావస్థలో పడిపోవడానికి మోడీ ప్రభుత్వం కారణమైందని తెలిపారు. బ్యాంకింగ్ రంగంలో నెలకొని ఉన్న ఖాళీ పోస్టుల భర్తీకై, తాత్కాలిక ఉద్యోగుల రెగ్యులరైజేషన్ కై బ్యాంకు ఉద్యోగులు మార్చి 24, 25న సమ్మె తలపెట్టారని గుర్తు చేశారు. ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణకు సాగే ఈ సమ్మెలో అన్ని ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు, సాధారణ ప్రజలు సంఘీభావంగా పాల్గొని సమ్మెను బలపరచాలని కందారపు మురళి ఆ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

టిటిడికి రెండు ఎలక్ట్రిక్ స్కూటర్లు విరాళం

ప్రజాశక్తి -తిరుమల

తిరుపతి ఏఎంఆర్‌డి బిల్డర్స్ ఎండిలు మారుతి నాయుడు, దేవేంద్ర నాయుడు సోమవారం రూ.2.28 లక్షలు విలువైన రెండు బజాజ్ ఎలక్ట్రిక్ స్కూటర్లను టిటిడికి విరాళంగా అందించారు. ఈ మేరకు శ్రీవారి ఆలయం ఎదుట స్కూటర్లకు పూజలు నిర్వహించి డెప్యూటీ ఈవో లోకనాథంకు స్కూటర్ల తాళాలు అందించారు. ఈ కార్యక్రమంలో తిరుమల డిఐ సుబ్రమణ్యం పాల్గొన్నారు.

గ్రీన్ హైడ్రోజన్ ప్లాంట్ ప్రారంభోత్సవం

వర్చువల్‌గా ప్రారంభించిన సీఎం చంద్రబాబు

ప్రజాశక్తి -ఏర్పేడు

ఏర్పేడు మండలం పంగూరు వద్ద రాక్‌మ్యాన్ ఇండస్ట్రీస్‌లో హీరో ఫ్యూచర్ ఎనర్జీస్ మొట్టమొదటి గ్రీన్ హైడ్రోజన్ బ్లెండింగ్ ప్లాంట్‌ను ఏపీ సీఎం చంద్రబాబు ఉండవల్లి నివాసం నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు. హీరో ఫ్యూచర్ ఎనర్జీస్ చేపట్టిన ఈ ప్రాజెక్ట్ పారిశ్రామిక అవసరాల కోసం పీఎన్జీ, ఎల్పీజీతో గ్రీన్ హైడ్రోజన్ బ్లెండింగ్‌కు సరికొత్త విధానాన్ని అనుసరిస్తోందని సీఎం అన్నారు. ఈ సాంకేతికత కార్బన్ ఉద్గారాలను గణనీయంగా తగ్గిస్తుందని, భారతదేశ శక్తి పరివర్తనకు కొత్త బెంచ్‌మార్క్‌ను నిర్దేశిస్తుందని వివరించారు. తిరుపతిలో ప్రవేశపెట్టబడిన స్కేలబుల్ మోడల్‌ను ఆంధ్రప్రదేశ్‌లోనూ, ఇంకా దేశవ్యాప్తంగా ఇతర పరిశ్రమల్లోనూ అనుకరించవచ్చని చెప్పారు.

స్వర్ణాంధ్ర విజన్-2047 సాధనలో పేర్కొన్నట్టుగా గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తిలో ఏపీని ప్రపంచ కేంద్రంగా మార్చాలనే లక్ష్యానికి ఇది తొలిఅడుగు అవుతుందన్నారు. వెయ్యి కోట్ల పెట్టుబడితో రెండు వేల మందికి ఉపాధి కల్పించేలా ప్లాంట్ నెలకొల్పడంతో తిరుపతి, చుట్టుపక్కల ప్రాంతాల వారికి ఉపాధి అవకాశాలు మరింత మెరుగుపడతాయని చెప్పారు. వెయ్యి కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేసిన గ్రీన్ హైడ్రోజన్ ప్లాంట్ ద్వారా రెండు వేల మందికి ఉపాధి కలుగుతుంది. ఏడాదికి 25 టన్నుల గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి చేస్తుంది. దీనిని ఏడాదికి 54 టన్నులకు పెంచుకునే అవకాశం ఉంది. ఏడాదికి 206 టన్నుల కార్బన్ డైఆక్సైడ్ ఉద్గారాల తగ్గింపుతో పాటు, వాతావరణంలోకి ఏడాదికి 190 నుంచి 195 టన్నుల ఆక్సిజన్ విడుదల అవుతుంది. మొత్తంమ్మీద 8 శాతం నుంచి 10 శాతం ఉద్గార తగ్గింపు సాధ్యమవుతుంది. 1960లో స్థాపించిన హీరో గ్రూప్‌లో భాగమైన రాక్‌మ్యాన్ ఇండస్ట్రీస్ అల్యూమినియం డై-కాస్టింగ్ భాగాలు, అధునాతన కార్బన్ సంబంధిత ఆటో భాగాల తయారీదారు. లుధియానా, హరిద్వార్, చెన్నై, బవాల్, సూరత్, వడోదర, తిరుపతి ప్లాంట్లతో రూ.2,390 కోట్ల వార్షిక ఆదాయం కలిగి ఉందని, ఏరో స్పేస్ హై - అండ్ ఆటోమేటిక్ రంగాల్లో ప్రవేశించిందన్నారు. ఈ వర్చువల్ ప్రారంభోత్సవంలో జేసీ శుభం బన్సాల్, శ్రీకాళహస్తి ఆర్డిఓ భాను ప్రకాష్, రాక్ మెన్ సిబ్బంది, హీరో ఫ్యూచర్ ఎనర్జీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ సెకండ్ ఇయర్ పరీక్ష ప్రారంభం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు సోమవారం జరిగిన సంస్కృతం పరీక్షలకు జిల్లావ్యాప్తంగా 572 మంది విద్యార్థులు గైర్హాజరు అయ్యారని ఆర్ఐఓ ప్రభాకర్ రెడ్డి తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 100 సెంటర్ల ద్వారా 28,355 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 28,783 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారని, 572 మంది గైర్హాజరు అయ్యారని తెలిపారు.

ఆవిర్భావ సభను జయప్రదం చేయండి : ఆరణి

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

పిఠాపురంలో ఈనెల 14వ తేదీ జరగనున్న జనసేన పార్టీ ఆవిర్భావ సభను జయప్రదం చేయాలని కార్యకర్తలు, నాయకులకు తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పిలుపునిచ్చారు. స్థానిక కేటీ రోడ్డులోని ఎమ్మెల్యే నివాసంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పిఠాపురంలో ఈ నెల 12, 13, 14 తేదీల్లో జనసేన ఆవిర్భావ సభ సమావేశాలు జరగనున్నాయన్నారు. నియోజకవర్గం లోని అన్ని గ్రామాల్లో జమసేన జెండా ఎగురవేసి సభకు శ్రేణులు పెద్ద ఎత్తున వచ్చేలా నేతలు చూడాలని సూచించారు. ప్రతి నియోజకవర్గ నుంచి 300 మంది తక్కువ కాకుండా, పిఠాపురం సభకు హాజరు కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జనసేన నాయకులు రాజారెడ్డి, వినుత, సుభాషిని, పాల్గొన్నారు.

ఎస్వీయూ దూరవిద్యా విభాగ సంచాలకుడుగా వూకా రమేష్ బాబు

ప్రజాశక్తి - క్యాంపస్

ఎస్వీ యూనివర్సిటీ దూరవిద్యా విభాగ ఇంచార్జ్ సంచాలకుడుగా ఆచార్య వూకా రమేష్ బాబును నియమించారు. ఆ మేరకు వీసీ ఆచార్య అప్పారావు, రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు చేతుల మీదుగా ఆయన నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా రమేష్ బాబు మాట్లాడుతూ దూరవిద్య పరీక్షలను త్వరగా నిర్వహించాలని ఉన్నతాధికారులు ఆదేశించారన్నారు. 2024-25 సంబంధించి త్వరలో నోటిఫికేషన్ కూడా వచ్చేందుకు ప్రయత్నం చేస్తామని ఆయన అన్నారు. ఈ సందర్భంగా ఆయనను వర్సిటీ ఆచార్యులు ఎన్ సి రాయుడు, కిశోర్, పిసి వెంకటేశ్వర్లు, ప్రయాగ, కోఆర్డినేటర్ హరికష్ణ యాదవ్, ఆనంద గౌడ్, గాలం దయ సాగర్, గిరీష్, రమేష్ నాయుడు, తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

వైష్ణవి యాజమాన్యంపై సిఐకి వినతి

ప్రజాశక్తి - పెళ్లకూరు

పెళ్లకూరు మండలంలోని పునబాక గ్రామం వద్ద ఉన్న వైష్ణవి పాల డెయిరీలో 15ఏళ్లుగా 40 మంది కార్మికులం అతి తక్కువ జీతానికి పనిచేస్తున్నామని, తిరుమల లడ్డూ కల్తీ విషయంలో ఎఫ్ఎస్ఎస్ఐ (ఫుడ్‌సేఫ్టీ) వారు వైష్ణవి లైసెన్స్ రద్దు చేయడంతో దిక్కుతోచకుండా ఉన్నామని సిఐ సంగమేశ్వరరావుకు సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు వినతిపత్రం అందించారు. ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా కంపెనీని మూసివేశారన్నారు. డిసెంబర్ 12న కార్మికులను పిలిపించుకుని జనవరి 31లోపు తమకు రావాల్సిన డిఎ, పిఎఫ్, జీతం మొత్తం చెల్లిస్తామని, అకౌంట్లో జమచేయుటకు కొన్ని ఫారాలమీద సంతకాలు చేయాలని మమ్మల్ని మోసగించారన్నారు. మా దగ్గర సంతకాలు తీసుకుని మాకు ఇవ్వకపోవడంతో 31వ తేదీ వెళ్లి యాజమాన్యంను కలిసామన్నారు. మళ్లీ 15 రోజులు టైం అడిగారని, అయినప్పటికీ మాకు న్యాయం జరగకపోవడంతో నిరవధిక దీక్ష చేస్తున్నామన్నారు. మా గ్రామాలకు వీధినపడ్డాయని, అర్ధంతరంగా ఉద్యోగాల్లో నిలిపేసి, జీతాలివ్వకుండా చేస్తే తాము ఎలా బతకాలని వాపోయారు.

రోడ్ల సమస్యలు.. అసెంబ్లీ దృష్టికి..

ప్రజాశక్తి - పిచ్చాటూరు

సత్యవేడు నియోజకవర్గంలోని సమస్యలను ఎంఎల్ఎ ఆదిమూలం అసెంబ్లీలో ప్రస్తావించారు. అనంతరం సిఎం నారా చంద్రబాబుకు, మంత్రి నారా లోకేష్‌కు వినతిపత్రం అందజేశారు. నియోజకవర్గంలో గత ప్రభుత్వంలో 36 రోడ్లు మంజూరయ్యాయన్నారు.కేవలం ఆరు రోడ్లు మాత్రమే వేశారన్నారు. ఎన్‌డిబి ద్వారా నాగలాపురం నుంచి చిన్నపాండూరు వరకు రూ.40 కోట్లు, బుచ్చినాయుడు కండ్రిగ నుంచి సూళ్లూరుపేట వరకూ రూ.12 కోట్లు పనులు రామచంద్రారెడ్డి అనే కాంట్రాక్టర్ దక్కించుకుని పనులు చేయలేదన్నారు. తాను మండలాల్లో తిరగాలంటే తమిళనాడు లోపలకు వెళ్లాల్సిందేనని, అయితే కరోనా సమయంలో అక్కడి ప్రభుత్వం రాకపోకలకు అనుమతించలేదన్నారు. ఇందుకోసం దాసుకుప్పం బైపాస్‌రోడ్డు నిర్మాణానికి రూ.26 కోట్లు మంజూరు చేశారని, ప్రస్తుతం అది పరిశీలనలో ఉందన్నారు. మంజూరై ఆగిపోయిన రోడ్లను నిర్మించాలని సభ దృష్టికి తీసుకెళ్లారు. తమ నియోజకవర్గంలో స్మశానాలు, స్మశానాలకు రోడ్లు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు.

ముక్కంటీశా..ప్రచారమేది..?

మూలనపడ్డ ప్రచారరథం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

శ్రీకాళహస్తీశ్వరాలయంలో జరిగే ఉత్సవాలను ప్రజలకు తెలియజేసేందుకు అధికారులు ప్రచార రథాన్ని ఏర్పాటు చేశారు. స్వామి అమ్మవార్లతో పాటు రాహు-కేతువులు, భక్త కన్నప్ప విగ్రహాలతో ఆకర్షణీయంగా ఉండేది. ప్రచార రథం మైకు ద్వారా ప్రజలకు సమాచారం చేరేది. దీనివల్ల ఉత్సవం ఉందని పట్టణ ప్రజలకు తెలిసేది. ముందుగా ప్రచార రథంలోని స్వామి అమ్మవార్లను, రాహు కేతువులను దర్శించుకున్న భక్తులు ఆ తర్వాత ఉత్సవ మూర్తులను దర్శించుకోవడం ఆనవాయితీగా ఉంది. అయితే దేవస్తానం అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రచార రథం కనుమరుగైంది. చెప్పాలంటే మూలనపడేశారు. ప్రత్యేక ఆకర్షణగా నిలిచే ఈ రథం దుమ్ము ధూళితో నిండి సన్నిధి వీధిలోని శివ సదన్ లో సేదతీరుతోంది. రథానికి మరమ్మతులు చేయక పోవడంతో వినియోగించడం లేదు. దీనిపై భక్తులు తీవ్ర అసంతప్తి వ్యక్తం చేస్తున్నారు. శివరాత్రి ఉత్సవాల పేరుతో కోట్ల రూపాయలు ఖర్చు చేసే దేవస్థానం అధికారులు వాహనాన్ని మరమ్మతు చేయించక పోవడంపై ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. శ్రీకాళహస్తిలోనే కాకుండా రాష్ట్రంలోని అనేక ప్రాంతాలకు వెళ్లి శ్రీకాళహస్తి దేవస్థానం తరపున ప్రచారం చేసే రథానికి మరమ్మతులు చేయించి తిరిగి ఆలయ ప్రచారానికి వినియోగించాలని భక్తులు కోరుతున్నారు.

క్రీడా స్ఫూర్తితో క్రికెట్ టోర్నమెంట్

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

రమేష్ లెవెన్స్ ఆధ్వర్యంలో వై లెవన్స్ ప్రీమియర్ లీగ్ టి10 క్రికెట్ టోర్నమెంట్‌ను సోమవారం ఘనంగా నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాజరాజేశ్వరి జ్ఞాన పీఠం పీఠాధిపతి మూర్తి స్వామి విచ్చేశారు. క్రీడా మైదానం వద్ద చేరుకున్న పీఠాధిపతికి టోర్నమెంట్ నిర్వాహకులు రమేష్ ఆధ్వర్యంలో ఘన స్వాగతం లభించింది. మూర్తి స్వామి క్రీడాకారులను ప్రోత్సహించే విధంగా టోర్నమెంట్ను వీక్షించిన తర్వాత విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ టోర్నమెంట్లో ఫైనల్స్ లో తలపడ్డ రచ్చ రంబోలా వైజాగ్ లెవెన్స్, చోట లెవెన్స్ లో విజేతగా నిలిచిన చోటా లెవన్స్ సభ్యులకు కప్పుతో పాటుగా లక్ష రూపాయల బహుమతి అందజేశారు. ఈ సందర్భంగా మూర్తి స్వామి మాట్లాడుతూ నేటి యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ, క్రీడల్లో పాల్గొనడం చాలా సంతోషకరమని అన్నారు. ఈ టోర్నమెంట్ నిర్వహించిన నిర్వాహకుడు దామినేడు పదవ వార్డు మెంబర్ రమేష్ ను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎలైట్ హాస్పిటల్స్ అధినేత కోడూరు బాలసుబ్రమణ్యం, డాలర్స్ గ్రూప్ ఇన్చార్జి సోము, జట్టు కెప్టెన్ జశ్వంత్, వైస్ కెప్టెన్ వంశీ, క్రీడాకారులు పాల్గొన్నారు.

'మెగా' నిర్లక్ష్యం

రెండు నెలలుగా వేతనాల ఎగవేత

కాంట్రాక్టర్ తీరుపై రోడ్డెక్కిన కార్మికులు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

మదనపల్లి-నాయుడుపేట ఆరు లేన్ల జాతీయ రహదారి విస్తరణ పేరిట పనులు ప్రారంభించిన మెగా సంస్థ అడగడుగునా కార్మికుల పట్ల నిర్లక్ష్యం వహిస్తోంది. కార్మికుల భద్రతను గాలికొదిలేసిన ఆ సంస్థ వేతనాల విషయంలోనూ ఎగవేత ధోరణిని అవలంబిస్తోంది. మెగా సంస్థకు మ్యాన్ పవర్ ను సరఫరా చేస్తున్న కాంట్రాక్టర్ గత రెండు నెలలుగా కార్మికులకు వేతనాలు చెల్లించడం లేదు. దీంతో కార్మికులు సోమవారం శ్రీకాళహస్తి సమీపంలో ఉన్న మెగా బేస్ క్యాంపు వద్ద గేట్లను మూసి నిరసన తెలియజేశారు. తమకు వేతనాలం చెల్లించేంత వరకు పనులు చేయబోమంటూ సహాయ నిరాకరణ చేశారు. కనీసం సంక్రాంతికి కూడా తమకు వేతనాలు చెల్లించకపోవడంతో పండుగను కుటుంబంతో కలిసి ఆనందంగా గడుపులేకపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. రెక్కాడితే కానీ డొక్కాడని కార్మికుల పట్ల మెగా సంస్థ నిర్లక్ష్యం వీడి వేతనాలు వెంటనే మంజూరయ్యేలా చొరవ చూపాలని డిమాండ్ చేశారు. లేకుంటే మెగా పనులను అడ్డుకుంటామని హెచ్చరించారు. కార్మికుల ఆందోళనతో దిగొచ్చిన మెగా జీఎం మల్లికార్జున మంగళవారం సాయంత్రం లోపు జీతాలు చెల్లించే ఏర్పాటు చేస్తామని హామీ ఇవ్వడంతో కార్మికులు ఆందోళన విరమించారు.

'సిఎంఆర్' మాల్‌లో ఈఎస్‌ఐ ఆయుష్ మెడికల్ క్యాంపు

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

ఈఎస్ఐ ఆసుపత్రి ఆధ్వర్యంలో నగరంలో సిఎంఆర్ టెక్స్ టైల్స్ షాపింగ్ మాల్‌లో సోమవారం ఆయుష్, యోగ మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈఎస్ఐ కార్పొరేషన్ సంస్థ 74వ ఆవిర్భావ మాసోత్సవాల్లో భాగంగా వస్త్ర దుకాణంలో పనిచేసే ఈఎస్ఐ. లబ్ధిదారులకు, సిబ్బందికి ప్రతి రోజూ యోగ చేయడంపైన కలిగే ఉపయోగాన్ని డాక్టర్లు వివరించారు. ఈ మెడికల్ క్యాంపులో స్పెషలిస్ట్ డాక్టర్ పి. రమేష్ కుమార్, ఆయుష్ డాక్టర్స్ స్వప్న మంజరీ, శ్రీలత, హెడ్ నర్స్ పి. సరస్వతమ్మ, వైద్య సిబ్బంది సిఎస్ మంజుల, హేమలత, జయంతి, నరసింహులు,ఇందిర తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీనే వేతనాలు చెల్లించాలి

తిరుపతి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : మున్సిపల్ కార్మికుల వేతనాల చెల్లింపు ప్రైవేట్ ఏజెన్సీలకు ఇవ్వొద్దని మున్సిపల్ కార్మికులు డిమాండ్ చేశారు. సోమవారం చిత్తూరు జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేశారు. ఈ ధర్నాలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి రామచంద్రయ్య, ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య, ఏఐటీయుసీ జిల్లా గౌరవ అధ్యక్షులు నాగరాజులు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ కార్మికుల సంక్షేమం మున్సిపాలిటీనే నిర్వహించాలన్నారు. అదేవిధంగా రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా తిరుపతి జిల్లా కలెక్టర్ కార్యాలయం దగ్గర మున్సిపల్ వర్కర్స్ యూనియన్, ఏఐటియుసి అనుబంధం ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా గౌరవ అధ్యక్షులు నాగరాజు మాట్లాడుతూ ఆప్కాస్ రద్దు చేయడం తగదన్నారు. కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి రామచంద్రయ్య, ఏఐటీయుసీ కార్యదర్శి కోదండయ్య, ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి దాసరి చంద్ర, నాయకులు గోపీనాథ్, మనీ, రమాదేవి, లత, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు చిరంజీవి, వినాయక శేఖర్, నాగరాజు జిల్లాలోని మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

నాటు సారా అమ్మితే కఠిన చర్యలు

ప్రజాశక్తి - యర్రావారిపాలెం: మండల కేంద్రం, వేములవాడలో చిత్తూర్ ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ ఆదేశాల మేరకు చంద్రగిరి ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ వారి ఆధ్వర్యంలో సోమవారం నవోదయం 2.0 కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో ఎవరైనా అక్రమంగా నాటు సారా తయారుచేసినా, అమ్మినా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డిపి ఈవో నాగమల్లేశ్వరరావు రెడ్డి, జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ వాసుదేవ చౌదరి, చంద్రగిరి ఎక్సైజ్ సీఐ, కెవిఎస్, ఫణీంద్ర, ఎస్సై సుధాకర్, గ్రామస్తులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశాంతంగా ప్రారంభమైన ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని ఐదు కేంద్రాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. విద్యార్థినీ విద్యార్థులను తనిఖీ చేసి పరీక్షా హాల్లోకి అనుమతించారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేశారు.

ఇంటి పట్టాల కోసం షికారిలు ధర్నా

నిరసన తెలపుతున్న షికారీలు

ప్రజాశక్తి - వరదయ్యపాలెం : చిన్న పాండురు, నక్కల మిట్ట కాలనీవాసులు తమకు ఇంటి పట్టాలు మంజూరు చేయాలని ఎమ్మార్వో కార్యాలయం వద్ద తిరుపతి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బాలగురువం బాబుతో కలిసి సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా బాల గురువం బాబు మాట్లాడుతూ గత 15 సంవత్సరాలుగా నక్కల మిట్ట కాలనీలో వీరు స్థిర నివాసం ఉంటున్న వీటిని ఎవరూ పట్టించుకోవడంలేదని, విద్యుత్, నీరు, రోడ్లు వంటి సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కారం అయ్యేంతవరకు దీక్షకు దిగుతామని హెచ్చరించారు. నివాసానికి పట్టాలు లేదా ప్రభుత్వ గృహాలు మంజూరు చేయాలని లేని పక్షంలో కాలని వాసులు ఎమ్మార్వో కార్యాలయం వద్ద నుండి కదిలే ప్రసక్తే లేదని తెలిపారు. అనంతరం సంబంధిత అధికారులు సమస్యను పరిష్కరించడానికి ప్రయత్నిస్తామని హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు.

రేపు సబ్సిడీ రుణాలకు ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి - నాయుడుపేట రూరల్: నాయుడుపేట మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 5వ తేదీన బీసీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాల మంజూరుకు దరఖాస్తు చేసుకున్న వారికి ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు నాయుడుపేట ఎంపీడీవో కె.సురేష్ బాబు ఒక ప్రకటనలో తెలిపారు.నాయుడుపేట మండలంలోని రూరల్ ప్రాంతాలకు 26 సబ్సిడీ రుణాలు మంజూరైనట్లు ఆయన తెలిపారు.

తమిళనాడుకు వెళ్లి పెన్షన్ అందజేత

ప్రజాశక్తి- ఏర్పేడు: మండలంలోని ఆమందూరు గ్రామపంచాయతీ, బాలకృష్ణపురం గ్రామానికి చెందిన కోదండం ప్రకాశంకు పెన్షన్ ప్రతి మాసం 15,000 రూపాయలు ప్రభుత్వం అందిస్తోంది. ప్రస్తుతం ఆయన తమిళనాడు రాష్ట్రంలో ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఎంపీడీవో సౌభాగ్యం, సర్పంచ్ బొడుగు బాల గురునాథం యాదవ్, పంచాయతీ కార్యదర్శి సుధాకర్‌ల సూచన మేరకు, ఆమందూరు వెల్ఫేర్ అసిస్టెంట్ సూరప రాజు ఆనంద్ తమిళనాడుకు వెళ్లి ఆసుపత్రిలో కోదండం ప్రకాశంకు పెన్షన్ అందజేశారు.

సునీల్ కుమార్ సస్పెన్షన్ చట్ట విరుద్ధం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ఐపీఎస్ ఆఫీసర్ పివి సునీల్ కుమార్‌ను రాష్ట్ర ప్రభుత్వం సస్పెండ్ చేయడం సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమైన చర్య అని లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు విజయకుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ అనుమతి లేకుండా విదేశీ పర్యటన చేశారనే నెపం వేశారని, కానీ ఆయన తన సొంత ఖర్చులతో అమెరికాలో ఉన్న తన కుమారుడిని చూడడానికి వెళ్లారన్నారు. ఎటువంటి నోటీసు ఇవ్వకుండా సస్పెండ్ చేయటాన్ని ప్రభుత్వ కుట్ర గానే భావిస్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి వెనుకబడిన వర్గాల అధికారులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని, ఇప్పటికే పలువురు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులకు పోస్టింగులు ఇవ్వకుండా తన కర్కసత్వాన్ని ప్రదర్శిస్తోందన్నారు. రాజకీయం అంటే అధికారం చెలాయించడం కాదని, ప్రజలిచ్చిన అధికారాన్ని దేశ, రాష్ట్ర ప్రజల అభివృద్ధికి వినియోగించడమని హితవు పలికారు.

పర్యావరణాన్ని కాపాడుకుందాం

సమావేశంలో ప్రసంగిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ చంద్రమౌళి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పర్యావరణ హితానికి వృక్ష, జంతు జాలాల పరిరక్షణ అత్యంత ముఖ్యమని, వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరికీ ఉందని స్థానిక ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చంద్రమౌళి పేర్కొన్నారు. ప్రపంచ వన్యప్రాణి దినోత్సవం సందర్భంగా సోమవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల జంతుశాస్త్ర విభాగం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అంతరించిపోతున్న జీవజాతుల గురించి, ఔషధాల తయారీలో మొక్కల ప్రాముఖ్యతను విభాగాధిపతులు డాక్టర్ సాంసంగ్ రాజు, అధ్యాపకులు డాక్టర్ వెంకటకృష్ణయ్య, డాక్టర్ షర్మిల, డాక్టర్ కోటేశ్వరరావు విద్యార్థులకు వివరించారు.

విరామంతో.. ఉపశమనం

- పరీక్షకు పరీక్షకు మధ్య గ్యాప్
- పదవ తరగతి విద్యార్థులపై ఒత్తిడి తగ్గించేందుకు నిర్ణయం
- పక్కాగా పరీక్షలకు సిద్ధం

జడ్పీ పాఠశాలలో పరీక్షలకు సిద్ధమవుతున్న పది విద్యార్థులు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్న కొద్ది విద్యార్థుల్లో తెలియని ఒత్తిడి, ఆందోళన క్రమేపి పెరుగుతుంది. మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలనే లక్ష్యంతో పగలు, రాత్రి చదువుతారు. కొందరు పరీక్షల సమయానికి చదివిన వాటిలో కొన్ని మరిచిపోతుంటారు. ఈ కారణంగా ఆశించిన స్థాయిలో మార్కులు రాక విద్యార్థులు ఇబ్బంది పడతారు. ఇంకొందరయితే సరిగా ఆహారం కూడా తీసుకోక నీరసించి పోతారు. దీనిని గుర్తించిన కూటమి ప్రభుత్వం విద్యార్థుల్లో ఒత్తిడి తగ్గించేలా ప్రతి పరీక్షకు మధ్య ఒకరోజు విరామం వచ్చేలా టైమ్ టేబుల్ ప్రకటించింది. దీంతో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గతంలో పది పరీక్షలను రోజుకు ఒకటి చొప్పున నిర్వహించడం వల్ల విద్యార్థులు ఆందోళనకు గురయ్యేవారు. పండుగ, వారాంతపు సెలవులు వస్తే తప్ప విరామం వచ్చేది కాదు. ఇదిలా ఉండగా కొన్నేళ్లుగా పాఠ్యాంశాలకు రెండు పేపర్ల విధానం తొలగించి, 100 మార్కులకు ఒకే పేపర్ విధానంతో పరీక్షలు నిర్వహించడంతో విద్యార్థులపై మరింత భారం పెంచినట్లు అయింది. ప్రస్తుత విద్యా సంవత్సరానికి సంబంధించి పదో తరగతి పరీక్షల షెడ్యూల్ ఇటీవల ప్రభుత్వం విడుదల చేసింది. ఈనెల 17వ తేదీ నుంచి 31వ తేదీ వరకు ఈ పరీక్షలు జరగనున్నాయి. ప్రతి పరీక్షకు మధ్య ప్రభుత్వం ఒకరోజు విరామం ప్రకటించగా గణితం, సాంఘిక శాస్త్రం పరీక్షలకు అదనంగా మరో రోజు విరామం వచ్చింది. ఉపాధ్యాయులు వ్యక్తిగత శ్రద్ధతో విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం నింపడం, అదనపు తరగతుల నిర్వహణ, నిత్యం చిన్నచిన్న పరీక్షలు పెట్టడం, ప్రీ ఫైనల్ పరీక్షలు నిర్వహించి వారిలోని భయం పోగడతారు. వంద రోజుల ప్రణాళికలో ఎంఈవోలు పర్యవేక్షణ చేసి హెచ్ఎంలు, ఉపాధ్యాయులను ప్రోత్సహిస్తూ పది విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించారు.

గూడూరు నియోజకవర్గంలో పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులు

గూడూరు మండలం	592 మంది
చిల్లకూరు	411 మంది
కోట	600 మంది
వాకాడు	196 మంది
చిట్టమూరు	349 మంది
మొత్తం	2,148 మంది

(బాలికలు 1,116 బాలురు 1,032)

విరామం రావడం విద్యార్థులకు మేలు

పది పరీక్షల్లో పరీక్ష పరీక్షకు మధ్య ఒకరోజు విరామం రావడం ఇదే తొలిసారి. ప్రభుత్వం ప్రవేశపెట్టిన విధానం వల్ల విద్యార్థులకు ఎంతో మేలు చేకూరుతుంది. దీంతో ఉత్తీర్ణత శాతం పెరగడంతో పాటు విద్యార్థుల్లో మానసిక ఒత్తిడి తగ్గుతుంది.

- డిప్యూటీ డిఇఓ, డి.సనత్ కుమార్

చట్టాన్ని అతిక్రమిస్తే ఎంతటివారైనా చర్యలు : ఎస్‌పి

ప్రజాశక్తి -తిరుపతి సిటీ : రాత్రుల్లో గస్తీ తిరుగుతూ, రోడ్లపై అనుమానాస్పదంగా తిరుగుతున్న 1484 మందికి కౌన్సెలింగ్ ఇచ్చినట్లు ఎస్‌పి హర్షవర్ధన్‌రాజు తెలిపారు. గత నెలరోజుల్లో సాధించిన ప్రగతిని వివరించారు. నేర నియంత్రణ చేస్తూ, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని, శాంతిభద్రతల పరిరక్షణ చేయాలని కోరారు. 94.5 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. 335 మంది రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ ఇచ్చారు. బహిరంగ మద్యం సేవించే వారిపై 2,296 కేసులను నమోదు చేశారు. 292 ప్రదేశాలను గుర్తించి శుభ్రం చేయించారు. 333 మంది వాహనదారులపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేసి, రోడ్లకు ఇరువైపులా రోడ్లను ఆక్రమించి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే 2,222 మంది చిరు వ్యాపారులపై టౌన్ న్యూసెన్స్ యాక్ట్ కేసులను నమోదు చేసి కోర్టులో జరిమానాలు, శిక్షలు పడేలా చేశారు. మోటారు వెహికల్ కేసులకు సంబంధించి ద్విచక్రవాహనాలు, కారులు, ఆటోలపై మొత్తం 24,147 కేసులు నమోదు చేసి జరిమానా విధించారు. చట్టాన్ని అతిక్రమిస్తే ఎవరికైనా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ట్రాఫిక్ నియమాలపై అవగాహన

జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు ట్రాఫిక్ డిఎస్పి రామకష్ణాచారి ఆధ్వర్యంలో రోడ్డు ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించారు. హైవే రోడ్డులో తనపల్లి క్రాస్ నుంచి ఆర్.సి పురం జంక్షన్ వరకు ట్రాఫిక్ పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. వాహన తనిఖీల్లో భాగంగా వాహనం నడిపేటప్పుడు వ్యతిరేక మార్గంలో వాహనం నడిపితే ప్రమాదాలు జరుగుతాయని, ఎవరూ కూడా వ్యతిరేక మార్గంలో వాహనాలు నడపరాదని సూచించారు. ప్రతి ఒక్కరు ద్విచక్ర వాహనం నడిపినప్పుడు తప్పనిసరిగా ప్రాణ రక్షణ కోసం హెల్మెట్ ధరించాలి, వాహనం నడుపుతున్నప్పుడు తప్పనిసరిగా సంబంధిత రికార్డులు కలిగి ఉండాలి, రికార్డ్స్ లేనటువంటి 17 ద్విచక్ర వాహనాలు, 6 కార్లు, 1 జేసీబీ, మొత్తం 24 వాహనాలను సీజ్ చేశారు. వాహనదారులకు కొత్త మోటర్ వెహికల్ చట్టం - 1998 (అమెండ్మెంట్ ఇన్ - 2019) వాటిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డిఎస్ పి రామకష్ణ చారి, సీఐ సంజీవ్ కుమార్, ఎస్ ఐలు షేక్షావల్లి, పురుషోత్తం రెడ్డి, బాలాజీ పాల్గొన్నారు.

హెల్త్ అసిస్టెంట్ ఉద్యోగోన్నతిలో కౌన్సిల్‌దే తుది నిర్ణయం

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయములో హెల్త్ అసిస్టెంట్ ఉద్యోగోన్నతి కల్పించడంలో స్టాండింగ్ కమిటీ / కౌన్సిల్ వారు మాత్రమే తుది నిర్ణయం తీసుకోవలసి వుంటుంధని, ఇందులో కమిషనరుకు తుది నిర్ణాయాధికారాలు ఉండవు. కౌన్సిల్ లేని పక్షంలో ఉద్యోగోన్నతి లో తుది నిర్ణయం తీసుకునే అధికారం ప్రత్యేక అధికారికి ఉంటుందని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రకటన మేరకు ఇందుకు సంబంధించిన వివరాలు జీ.ఓ.ఎం.ఎస్.నెం.780 తేదీ: 20.11.2008 అనుసరించి హెల్త్ అసిస్టెంట్ పోస్ట్‌కు కావల్సిన విద్యా అర్హత ఇంటర్మీడియట్ నందు బయాలజికల్ సైన్స్ లేక మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ కలిగి ఉన్నచో శానిటరీ జవాన్ నుండి హెల్త్ అసిస్టెంట్‌గా ఉద్యోగోన్నతి కల్పిస్తారు. ఫిబ్రవరి 20న జరిగిన కౌన్సిల్ సమావే శంలో కౌన్సిల్ సభ్యుల అభ్యర్థన మేరకు కౌన్సిల్ తీర్మానాన్ని వాయిదా వేసినట్లు తెలిపారు. ఈ విషయంలో తప్పుడు ఆరోపణలు చేయరాదని పేర్కొన్నారు.

తెలుగు భాషకు బడ్జెట్‌లో ఊతం

ప్రజాశక్తి - రామచంద్రపురం: తెలుగు భాషాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం 10 కోట్ల రూపాయలు బడ్జెట్లో కేటాయించడం హర్షణీయమని రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు దొడ్డ ఉమామహేశ్వర్, సుబ్బాల కిరణ్ కుమార్‌లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యమంలో రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ నాయకులు పట్టాభి రామయ్య, కాటయ్య, చంద్ర ఈశ్వరయ్య, విశ్వనాథం, సుబ్రహ్మణ్యం, ఎండి వైదేహి, శ్యామలాదేవి, పి.గోవిందయ్య తదితరులు ఉన్నారు.

వినతులు సత్వరమే పరిష్కరించండి

ప్రజాశక్తి - రామచంద్రాపురం: రెవెన్యూ సదస్సులలో ప్రజల నుండి వచ్చిన వినతులను సిబ్బంది క్షేత్రస్థాయిలో విచారించి పరిష్కరించాలని తహసిల్దార్ వెంకటరమణ సూచించారు. సోమవారం తహసిల్దార్ కార్యాలయంలో పోలీస్, విద్యాశాఖ, రెవెన్యూ శాఖ అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు.మండల పరిధిలో గ్రావెల్ క్వారీ అనుమతులు లేకుండా ప్రభుత్వ భూముల్లో అక్రమంగా మట్టిని తవ్వి తరలిస్తే క్రిమినల్ కేసులు పెడతామని, వాహనాలను సీజ్ చేస్తామని తహసిల్దార్ కె.వెంకటరమణ మట్టి మాఫియాను హెచ్చరించారు. ఈ సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ అన్వర్ భాష, రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ అమృత, మండల సర్వేయర్ రమేష్ బాబు, మండల విద్యాశాఖ అధికారి మార్కండేయనాయుడు, హౌసింగ్ ఏఈ మహేష్ నాయుడు, ఇరిగేషన్ ఏఈ ఎత్తి రాజులు, ఆర్ఐ లక్ష్మీనారాయణ, వీఆర్వోలు ఝాన్సీ, మల్లికార్జున్, ప్రదీప్ నాయుడు, నరసింహులు, వెంకటరమణ, బాబు, గుణ భూషణ్ నాయుడు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఆకట్టుకున్న దర్శనమాహాత్మ్యంపై చర్చ

ప్రజాశక్తి - క్యాంపస్: జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో ఎన్ఎస్యు, అఖిల భారతీయ వీరశైవ శివాచార్య సంస్థానం, బెంగళూరు సంయుక్తాధ్వర్యంలో శక్తివిశిష్టాద్వైతంలో అంతర్జాతీయ విద్వత్ సదస్సులో సోమవారం దర్శనశాస్త్ర మాహాత్మ్యంపై చర్చ సభికులను ఆకట్టుకుంది. ఈ సదస్సులో అద్వైతవిభాగం అధ్యాపకులు డా.నాగరాజభట్, డా.శివరామ దాయగుడే, డా.మనోజషిండే, విభిన్న విభాగాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పుస్తకోత్సవం ప్రారంభం

ప్రజాశక్తి - క్యాంపస్ : యస్వీయు కేంద్రీయ గ్రంథాలయం ఆధ్వర్యంలో గ్రంథాలయ సదస్సు శాలలో పుస్తక ప్రదర్శన పుస్తకోత్సవంను వర్సిటీ ఇంచార్జీ విసి ఆచార్య అప్పారావు సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డీన్ ఆచార్య ఎన్ సి రాయుడు, అధ్యాపకులు రంగనాథ్, కిషోర్ కుమార్ నాయుడు, శేఖర్, అనిత, సుబ్రమణ్యం రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

స్కిల్ డెవలప్మెంట్‌పై శిక్షణ

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా ప్రముఖ ఫైనాన్స్ కంపెనీ బజాజ్ ఫిన్ సర్వీస్ సంస్థ ఎంబీఏ విద్యార్థులకు స్కిల్ డెవలప్మెంట్ పై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించింది. సోమవారం తిరుపతి కరకంబాడి శ్రీ వెంకటేశ్వర కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ లో ఎంబీఏ కోర్సును అభ్యసిస్తున్న విద్యార్థులకు స్కిల్ డెవలప్మెంట్ పై ఒక్కరోజు శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎస్వీసీఈ ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్.సుధాకర్ రెడ్డి, హెడ్ ప్రొఫెసర్ నీరజ, బజాజ్ ఫైన్ సర్వీస్ ప్రోగ్రాం ఇంచార్జి రామకృష్ణ, అధ్యాపకులు,విద్యార్థులు పాల్గొన్నారు.

మెస్ చార్జీలు పెంచాలి

ప్రజాశక్తి - క్యాంపస్ : బీసీ హాస్టల్ విద్యార్థులకు తక్షణమే మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంచాలని తిరుపతి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఓబిసి విద్యార్థి సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో జిల్లా డిప్యూటీ కలెక్టర్‌కు పబ్లిక్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ ఓబిసి విద్యార్థి సంక్షేమ సంఘం అధ్యక్షులు విజయ్ ఉత్తరాది, చిత్తూరు జిల్లా అధ్యక్షులు ఓ వెంకట్ యాదవ్, జిల్లా బీసీ నాయకులు బజారి, వర్సిటీ విద్యార్థి నాయకులు పార్థసారథి, సంబరం, ధనుష్ కుమార్ పాల్గొన్నారు.

బాలికల పాఠశాల ఏర్పాటు చేయండి సారూ..

ఇప్పుడున్న బాల, బాలికల పాఠశాల

- ప్రత్యేక బాలిక పాఠశాల ఏర్పాటుకు విద్యార్థినుల వినతి
- ఆకతాయిల నుంచి రక్షణ కావాలి
- మౌలిక వసతుల కల్పించాలి
- వినతులపై స్పందన శూన్యం
- ఎమ్మెల్యే ఆదిమూలం స్పందించాలి

ప్రజాశక్తి - పిచ్చా టూరు: తిరుపతి జిల్లా, పిచ్చాటూరు మండలం జడ్పీ ఉన్నత పాఠశాల బాలికలు తమకు 6వ తరగతి నుండి 12వ తరగతి వరకు ప్రత్యేక పాఠశాల కేటాయించాలని కోరుతున్నారు. ఈ పాఠశాలలో ఆరు నుండి పదవ తరగతి వరకు చదువుకునే బాలికలు 210 మంది ఉండగా, 11,12 వ తరగతులు చదివే బాలికలు 40 మంది ఉన్నారు. వీరికి ఈ పాఠశాలలో బాత్రూం వసతి సరిగా లేక ఇబ్బంది పడుతున్నారు. లైబ్రరీ, కంప్యూటర్ ల్యాబ్‌లు లేక వీరు విజ్ఞాన సముపార్జనలో వెనుకబడుతున్నారు. ఈ పాఠశాలలో ఎక్కువగా గ్రామీణ ప్రాంతంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు చెందిన పిల్లలు చదువుకుంటున్నారు. సౌకర్యాలతో కూడిన పాఠశాలలో నాణ్యమైన విద్యనందిస్తే విద్యార్థినులు ఉన్నత స్థాయికి చేరుకునే అవకాశం ఉంది. ఈ పాఠశాల విద్యార్థులు, తల్లిదండ్రులు గత ఐదు సంవత్సరాలుగా అటు ఎమ్మెల్యేలకు, ఇటు విద్యాశాఖ అధికారులకు బాలికల ప్రత్యేక పాఠశాల కావాలని విన్నవించినా కార్యరూపం దాల్చలేదు. ప్రభుత్వం విద్యార్థుల చదువుకోసం కోట్ల రూపాయలు వెచ్చిస్తున్నప్పటికీ బాలికలకు ప్రత్యేక పాఠశాల ఉంటే తమకు ధైర్యంగా ఉంటుందని తల్లిదండ్రులు అభిప్రాయపడుతున్నారు. తమకంటూ (బాలికలకు) ప్రత్యేక పాఠశాల ఉన్నట్లయితే బాలికలు ఆత్మవిశ్వాసంతో చక్కగా చదువుకుని, ఎలాంటి ప్రలోభాలకు లోనుకాక విద్యపై దృష్టి పెట్టి చదువుకుంటారని స్థానిక ప్రజలు తెలిపారు. ఈ పాఠశాలకు వచ్చేందుకు బస్సు సౌకర్యం ఉండటం వలన, పిచ్చాటూరు, కీలపూడి, నీరువాయి, కొప్పేడు, అప్పం బట్టు, మొదలగు గ్రామాల నుంచి బాలికలు ఎక్కువగా వచ్చి చదువుకుంటున్నారు. తమ పిల్లలను పాఠశాలకు పంపాలంటే ఆకతాయిల ఇబ్బంది లేకుండా వారికి ప్రత్యేక బాలికల పాఠశాల ఉంటే బాగుంటుందని విద్యార్థినుల తల్లిదండ్రులు కోరుతున్నారు. నియోజకవర్గం ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం స్పందించి, విద్యా శాఖ అధికారులతో మాట్లాడి బాలికలకు ప్రత్యేక పాఠశాల ఏర్పాటుకు కృషి చేయాలన్నారు.

ఏకాగ్రత కోల్పోతున్నాం

ఈ పాఠశాలలో బాల, బాలికలు కలిసి చదువుకోవడం వలన ఆడపిల్లలం అయిన మేము కొన్ని సందర్భాల్లో చదువులు పట్ల ఏకగ్రత కోల్పోతున్నాం. కారణాలు చెప్పుకోలేనివి, కావున విద్యాశాఖ అధికారులు మాకు ప్రత్యేక పాఠశాలు ఏర్పాటు చేయాలి. పాఠశాలలో బాత్రూం సౌకర్యం సరిగా ఉండేలా చూడాలి.

- యజ్ఞశ్రీ, మొదటి సంవత్సరం

బాలికలకు ప్రత్యేక పాఠశాల అవసరమే

ఈ పాఠశాలలో పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు ఎక్కువమంది చదువుకుంటున్నారు. వారితో బాలకలు శ్రద్ధగా చదువుపై ధ్యాస పెట్టాలంటే ప్రత్యేక బాలికల పాఠశాల అవసరం ఎంతో ఉంది. గతంలో ఎన్నోసార్లుపై అధికారులకు విజ్ఞప్తి చేసినా ఎవరూ పట్టించుకోలేదు.

- ఆనంద సెల్వి, బయాలజీ, ఉపాధ్యాయులు

ప్రత్యేక పాఠశాల కల్పించండి సార్

నేను పదో తరగతి చదువుతున్నాను. మా అమ్మ నాన్న ఎంతో సంతోషంగా బడికి పంపుతున్నారు కానీ పాఠశాల వెళ్లాలంటే కొందరు ఆకతాయిలు ఇబ్బంది పెడుతున్నారు. మాకు ప్రత్యేక పాటశాల ఉంటే ఇలింటి ఇబ్బందులు ఉండవు. చదువుకోవాలనే ఆసక్తితో రోజూ నీరువాయినుంచి రెండు కిలోమీటర్ల దూరం నడుచుకుంటూ పాఠశాలకు చేరుకుంటున్నాము.

- పూజ, పదో తరగతి

పాటశాలలో భద్రత కల్పించాలి

మాకు చదువుతోపాటు భద్రత కల్పించాలి. విద్యాశాఖ అధికారులు మాకు ప్రత్యేక పాఠశాల కల్పించి, ప్రశాంతమైన వాతావరణంలో చదువుకునే అవకాశం కల్పించాలి. లైబ్రరి, కంప్యూటర్ బోధన కల్పించాలి.

-జయశ్రీ, 9వ తరగతి

క్రైం న్యూస్

వంట గ్యాస్ లీక్.. పూరిల్లు దగ్ధం

కాలిన పూరింటిని పరిశీలిస్తున్న వీఆర్వో గుణ భూషణ్ నాయుడు

ప్రజాశక్తి - రామచంద్రపురం: మండలంలోని బలిజపల్లి ఎస్సీ కాలనీలో సోమవారం ఉదయం వంట గ్యాస్ లీకై పూరిల్లు దగ్ధమైంది. బలిజపల్లి ఎస్సీ కాలనీకి చెందిన జ్ఞానమ్మ గ్యాస్ స్టవ్‌ను వెలిగిస్తుండగా, సిలిండర్ లీకై మంటలు చెలరేగి పూరింటికి అంటుకున్నాయి. మంటలు వ్యాపించడంతో జ్ఞానమ్మ అరుచుకుంటూ వీధిలోకి పరుగులు తీసింది. చుట్టుపక్కల వారు వచ్చి మంటలు ఆర్పేందుకు ప్రయత్నం చేశారు. తిరుపతి అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి మంటలను ఆర్పేశారు. అప్పటికే ఇంట్లో చాలా సామగ్రి కాలి బూడిదయ్యాయి. విషయం తెలుసుకున్న రెవెన్యూ ఇన్స్పెక్టర్, లక్ష్మీనారాయణ, గ్రామ రెవెన్యూ అధికారి, గుణ భూషణ్ నాయుడులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. బాధితురాలు జ్ఞానమ్మకు ప్రభుత్వం నుండి ఆర్థిక సహాయాన్ని అందజేస్తామని భరోసా కల్పించారు.

చైన్ స్నాచర్ అరెస్ట్

బాలకృష్ణ అరెస్టు చేసిన పోలీసులు

ప్రజాశక్తి - పుత్తూరు, టౌన్ : పుత్తూరు అర్బన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ చైన్ స్నాచర్‌ను పోలీసులు అరెస్టు చేశారు. అతని వద్ద నుండి సుమారు రెండు లక్షల 36,800 విలువచేసే బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. డి ఎస్ పి రవికుమార్ తెలిపి వివరాల మేరకు పట్టణానికి చెందిన వెంకటరమణ రాజు సతీమణి భారతిని పుంగునూరు, పాలెం పల్లెకు చెందిన కొత్తపల్లి బాలకృష్ణ (40) బాడుగకు ఇల్లు కావాలని అడిగి, ఆమె ఇల్లు చూపే క్రమంలో మేడలోని బంగారు చైన్‌ను లాక్కొని వెళ్ళిపోయాడు. ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు, నిందితుడు బాలక్రిష్ణనున అరెస్ట్ చేసి, కేసు నమోదు చేసి దార్యప్తు చేస్తున్నారు.

శాస్త్రోక్తంగా 'ధ్వజావరోహణం'

ముగిసిన శివరాత్రి ఉత్సవాలు నేడు శాంతి ప్రదోష పూజలు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: మహాశివ రాత్రి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం శ్రీకాళహస్తీశ్వరాలయంలో ధ్వజావరోహణం కార్యక్రమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. దీంతో మహాశివరాత్రి ఉత్సవాలు ముగిశాయి. ఈ సందర్భంగా స్వామివారు సింహ వాహనంపై, అమ్మవారు కామధేను వాహనంపై పురవీధుల్లో విహరించారు. మంగళవారం ఆలయంలో శాంతి ప్రదోష పూజలు నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి సతీమణి రిషితా రెడ్డి, ఈవో బాపిరెడ్డి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుడి నిజాయితీ

దొరికిన బంగారు బ్రాస్లెట్‌ను భక్తుడికి అందచేసిన మాధవయ్య

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : స్థానిక శ్రీకాళహస్తీశ్వరాలయంలో పారిశుధ్య కార్మికుడుగా పనిచేస్తున్న మాధవయ్య తన మానవతను చాటుకున్నారు. తొట్టంబేడు మండలం పెద్దకన్నలి గ్రామానికి చెందిన ప్రేమ్ కుమార్ అనే యువకుడు సోమవారం ముక్కంటి దర్శనానికి వచ్చి తన మూడు సవర్ల బంగారు బ్రాస్లెట్(సుమారు రూ.3 లక్షలు)ను పోగొట్టుకున్నాడు. పారిశుధ్య పనులు చేస్తున్న మాధవయ్యకు బ్రాస్లెట్ కనిపించడంతో వన్ టౌన్ పోలీసులకు అప్పచెప్పాడు. పోలీసులు ప్రేమ్ కుమార్ ని పిలిపించి మాధవయ్య సమక్షంలో బ్రాస్లెట్ అప్పగించారు.

సరోజినీ నాయుడు అవార్డు అందుకున్న పులగల లక్ష్మి

పులగల లక్ష్మి దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - నాయుడుపేట: నాయుడుపేట మండలం, గొట్టిప్రోలు హైస్కూల్ ఇంగ్లీష్ ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న పులగల లక్ష్మి ఉత్తమ ఉపాధ్యాయురాలుగా సరోజినీ నాయుడు అవార్డుకు ఎంపికయ్యారు. నెల్లూరు జిల్లా ఇంగ్లీష్ టీచర్స్ అసోసియేషన్, సీఎం వి చంద్ర కుమార్‌లు సంయుక్తంగా సరోజినీ నాయుడు బెస్ట్ టీచర్స్ అవార్డు ప్రధానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నెల్లూరు జిల్లా డీఈవో డాక్టర్ రాజా బాలాజీ రావు, రావూస్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ కోటేశ్వరరావులు పులగల లక్ష్మిని బెస్ట్ టీచర్స్ అవార్డుకు ఎంపిక చేశారు. ఆదివారం సాయంత్రం నెల్లూరులో అవార్డులు ప్రదానం చేశారు.ఈ కార్యక్రమంలో ఆమెకు అవార్డు అందజేసి సన్మానించారు.ఈ కార్యక్రమంలో నెల్లూరు జిల్లా కామన్ ఎగ్జామినేషన్ బోర్డు సెక్రటరీ టాటా వెంకట రామ్ కుమార్, ఎంఈఓ అబ్దుల్ హమీద్‌లు పాల్గొన్నారు.

6న ఆర్ సి రెడ్డి కళాశాలలో జాబ్ మేళా

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ఈనెల 6వ తేదీన తిరుపతి ఆర్ సి రెడ్డి కళాశాలలో ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కరస్పాండెంట్ ఆర్ సి రెడ్డి తెలిపారు. ఈ జాబ్ మేళాను నిరుద్యోగ యువతీ, యువకులు ఉపయోగించుకోవాలని కోరారు.

పరుశురామేశ్వర సన్నిధిలో సినీ గాయకుడు

శ్రీకృష్ణ విష్ణుబొట్ల

ప్రజాశక్తి- ఏర్పేడు: ఏర్పేడు మండలం గుడిమల్లం పరుశురామేశ్వరుని తెలుగు సినీ గాయకుడు శ్రీకృష్ణ విష్ణుబొట్ల దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాటు చేసి, తీర్థ ప్రసాదాలు అందజేశారు.ఈ సందర్భంగా శ్రీకృష్ణ విష్ణుబొట్ల మాట్లాడుతూ స్వామిని దర్శించుకోవడం ఆనందంగా ఉందన్నారు.

రోటరీ వెస్ట్ క్లబ్ సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు, డి.ఎన్.ఆర్ కమ్యూనిటీ హాల్లో సోమవారం రోటరీ డిస్టిక్ గవర్నర్ సాధుగోపాలకృష్ణ అధికారిక పర్యటనలో భాగంగా ఆయనకు క్లబ్ సభ్యులు ఘన స్వాగతం పలికారు.రోటరీ వెస్ట్ క్లబ్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా డిస్టిక్ గవర్నర్ మాట్లాడుతూ పేద ప్రజలకు, విద్యార్థులకు రోటరీ వేస్ట్ క్లబ్ అందిస్తున్న సేవలు అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు నాసిన నాగులు, చోళవరం గిరిబాబు, పి.డి.జి మునిగిరీష్, ఏ.జి వాసు గౌడ్, సీనియర్ రొటేరియన్స్ ఎల్లసిరి గోపాల్ రెడ్డి, శ్రీకంటి రామ్మోహనరావు, బి.శ్రీకాంత్ రెడ్డి, బండి ధనుంజయ రెడ్డి, ఎం.వాసు, బొమ్మిడి శ్రీనివాసులు, శేగు శ్రీనివాసులు, సనత్ కుమార్ రెడ్డి, సిద్ధారెడ్డి, హరినాథ్ రెడ్డితదితరులు పాల్గొన్నారు.

సృజనాత్మకతను వెలికితీయాలి

నృత్యాలు చేస్తున్న స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ విద్యార్థినులు

ప్రజాశక్తి - క్యాంపస్ : ఇంజనీరింగ్ విద్యార్థినులలో అంతర్గతంగా దాగివున్న సృజనాత్మక శక్తులను ఇటువంటి ఫ్లాష్ మాబ్ కార్యక్రమాల ద్వారా వారిలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయాలని వర్సిటీ విసి వెన్నం ఉమ పిలుపునిచ్చారు. సృజనాత్మకత, సంఘీభావం శక్తివంతమైన ప్రదర్శనలో స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్, టెక్నాలజీ విద్యార్థులు శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం పరిపాలనా భవనం ఎదుట సోమవారం ఒక అద్భుతమైన ఫ్లాష్ మాబ్ కార్యక్రమం నిర్వహించారు. ఇది క్యాంపస్‌ను ఉత్సాహంగా మరియు కళాత్మకంగా మార్చింది. విరించి 2కె25 కార్యక్రమం సందర్భంగా, వివిధ విద్యా విభాగాలకు చెందిన విద్యార్థులు, క్యాంపస్ లో నృత్య ప్రదర్శనలు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి విసి వి.ఉమ, గౌరవ అతిథి రిజిస్ట్రార్ ప్రొ.ఎన్.రజనీ, డైరెక్టర్ ప్రొ.పి. మల్లికార్జున మార్చి 3వ తేదీన శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో జరిగే విరించి 2కె25 ఈవెంట్ పట్ల తమ సానుకూలతను వ్యక్త పరిచారు. ఫ్యాకల్టీ కన్వీనర్ నర్మిత, కో-కన్వీనర్ వింధ్య, విద్యార్థి సమన్వయకర్త ఎ.మోనిక, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆశ కార్మికుల సమస్యలపై
6న మహా ధర్నా

డిఎం అండ్ హెచ్‌ఓకి సిఐటియు వినతి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ఆశా కార్మికుల సమస్యలను పరిష్కరించాలని విజయవాడలో 6న జరిగే మహాధర్నాకు జిల్లాలోని ఆశాలందరూ పాల్గొని జయప్రదం చేయాలని సోమవారం సమస్యలపై డిఎం అండ్ హెచ్‌ఓకి సిఐటియు ఆధ్వర్యంలో వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా కార్యదర్శి గంగా, సిఐటియు నాయకులు సురేంద్రన్, వాడ గంగరాజులు మాట్లాడుతూ గతంలో ఆశాలకు కనీస వేతనాలు ఇస్తామని, పని భారం తగ్గిస్తామని ఇచ్చిన హామీలు అమలు కాలేదన్నారు. అలాగే పాత వారికి అందరికీ ఫోర్ జి సిమ్ములు ఇవ్వాలని, జనాభా ఎక్కువ ఉన్న ప్రాంతాల్లో అదనంగా ఆశాను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే జిల్లాలో ఆశాలకు అదనపు పనులన్నీ పెట్టడం సరైంది కాదని విధివిధానాలు వెంటనే సర్క్యులర్ జారీ చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ధర్నా సందర్భంగా ఆషాలను మభ్యపెట్టే పనిచేయకుండా అన్ని సమస్యల కోసం వెంటనే జీవోలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జీవోలు విడుదల కోసం 6న విజయవాడలో జరిగే మహా ధర్నాకు జిల్లాలో ఉన్న ఆశ అందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

టీటీడీ ఉద్యోగుల షటిల్, బ్యాడ్మింటన్ విజేతలు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ :
టీటీడీ ఉద్యోగుల క్రీడాపోటీల్లో సోమవారం నాటి వివరాలు ఇలా ఉన్నాయి. టీటీడీ విశ్రాంత అధికారుల షటిల్ బ్యాడ్మింటన్ సింగిల్స్ పోటీల్లో సుధాకర్ రావు విజయం సాధించగా, నాగేశ్వరరావు రన్నరప్‌గా నిలిచారు. టీటీడీ విశ్రాంత అధికారుల షటిల్ డబుల్స్ పోటీల్లో నాగేశ్వరరావు, సుధాకర్ జట్టు విజేతగా నిలవగా, ముని కృష్ణయ్య, రవి ప్రభాకర్ జట్టు రన్నరప్‌గా నిలిచింది.

మహిళా ఉద్యోగులు

విశ్రాంత మహిళా ఉద్యోగుల షటిల్ సింగిల్స్ పోటీల్లో లలితమ్మ విజేత కాగా, సుమతి రన్నర్‌గా నిలిచారు. విశ్రాంత మహిళా ఉద్యోగుల డబుల్స్ పోటీల్లో లలితమ్మ, సుమతి జట్టు విజేత కాగా, భారతి, ప్రభావతమ్మ జట్టు రన్నరప్‌గా నిలిచింది. ప్రత్యేక ప్రతిభావంతుల షటిల్ డబుల్ విభాగంలో సునీల్ కుమార్, రెడ్డప్ప జట్టు విజయం సాధించగా, హరి ప్రసాద్, సాయి ప్రసాద్ జట్టు రన్నరప్‌గా నిలిచారు. ప్రత్యేక ప్రతిభావంతుల సెటిల్ సింగల్ విభాగంలో సునీల్ కుమార్ విజయం సాధించగా హరి ప్రసాద్ రన్నరప్‌గా నిలిచారు. ప్రత్యేక ప్రతిభావంతుల మహిళల ఉద్యోగుల షటిల్ సింగల్ విభాగంలో సంపూర్ణమ్మ విజయం సాధించగా, నాగలక్ష్మి రన్నరప్‌గా నిలిచారు. పురుష ఉద్యోగుల బాల్ బ్యాట్మెంటన్ సింగల్ విభాగంలో కిరణ్ విజయం సాధించగా నాదముని రన్నరప్‌గా నిలిచారు.

తిరుమలలో చిన్నారి కిడ్నాప్

పాపను తీసుకెళ్లిన మహిళ, కిడ్నాప్‌కు గురైన దీక్షత

ప్రజాశక్తి - తిరుమల: దీక్షిత అనే చిన్నారిని, శ్రీవారి ఆలయానికి సమీపంలోని ఈ-7 గేటు వద్ద ఓ వృద్ధురాలు ఎత్తుకెళ్లిన ఘటన సిసి కెమెరాలో రికార్డ్ అయ్యింది. దీక్షిత తల్లిదండ్రులు తిరుమలలో చిరు వ్యాపారం చేస్తూ జీవిస్తున్నారు. ఆర్టీసీ బస్సులో బాలికని తిరుపతికి తీసుకెళ్లినట్లు సీసీ కెమెరాల ద్వారా పోలీసులు గుర్తించారు. కూతురు కనపడక పోవడంతో తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తంచేశారు. తిరుపతిలో బాలిక ఆచూకీ కోసం పోలీసు బృందాలు గాలిస్తున్నాయి. త్వరలో కిడ్నాప్‌ను చేధిస్తామని పోలీసులు తెలిపారు. తిరుమల టు టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థినులకు వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి - తిరుపతి : అంతర్జాతీయ మహిళా దినోత్సవం - 2025ను పురష్కరించుకుని జిల్లాలోని పాఠశాలల్లో విద్యార్థినులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. రాష్ట్ర డిజిపి హరీష్ కుమార్ గుప్తా ఆదేశాల మేరకు మార్చ్ 8 వ తేదీన జరగబోవు అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు నేతృత్వంలో జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో గల పాఠశాలల్లో విద్యార్థినులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. వ్యాసరచన పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని 'మహిళల సాధికారత, హక్కులు, సమానత్వం' వంటి కీలక విషయాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించగా, తమ అభిప్రాయాలను వ్యాస రూపంలో వ్యక్తపరిచారు. తిరుపతి రూరల్ పి.ఎస్, తిరుపతి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు విద్యార్థినులను తీసుకువచ్చి స్టేషన్ అధికారులు, సిబ్బంది ఎలా విధులు నిర్వహిస్తారోఅవగాహన కల్పించారు. ఇటువంటి కార్యక్రమాలను నిర్వహించడం ద్వారా విద్యార్థినులకు పోలీసులు లేదా పోలీస్ స్టేషన్లపై వున్న అభద్రతాభావం తొలగిపోయి, వారికి ఏమైనా సమస్యలు వుంటే ఆ సమస్యలను స్నేహపూర్వక వాతావరణంలో పోలీసు అధికారులకు సులభంగా తెలియజేసేందుకు అవకాశం వుంటుందని, తద్వారా వారి భద్రతకు మరింత మెరుగైన చర్యలు తీసుకునేందుకు అవకాశం వుంటుందని పోలీసు సిబ్బంది తెలియజేశారు. విద్యార్థులకు అంతర్జాతీయ మహిళా దినోత్సవ ప్రాముఖ్యతను వివరించి, సమాజంలో మహిళల పాత్ర, రక్షణ, సమానత్వం,హక్కుల గురించి, స్వీరక్షణ, ట్రాఫిక్ నిబంధనల గురించి,అవగాహన కల్పించడమే ఈ పోటీల ముఖ్య ఉద్దేశ్యమని అధికారులు తెలిపారు.

క్రమశిక్షణతో విద్యను అభ్యసించండి

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ సుబ్బరాయుడు

ప్రజాశక్తి - రామచంద్రాపురం (చంద్రగిరి) : సమాజంలో అసాంఘిక కార్యకలాపాలను నిర్మూలించటం ప్రతి ఒక్కరికి బాధ్యత అని సీఐ సుబ్బరాయుడు పేర్కొన్నారు. సోమ వారం చంద్రగిరి మండలం, ఎ.రంగంపేట పరిసర ప్రాంతాల్లో సీఐ సుబ్బరాయుడు అవగాహన కార్యక్రమం చేపట్టారు. విద్యార్థులు దురాలవాట్లకు దూరంగా ఉండాలని కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పీజీ హాస్టల్స్ యాజమాన్యాలు, ఆటో డ్రైవర్లు, ఎస్టిఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

అహల్య బాయి జయంతి

జయంతి వేడుకల్లో టీటీడీ బోర్డు సభ్యులు భాను ప్రకాష్ రెడ్డి

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళ డిగ్రీ, పీజీ కళాశాలలో ఏబిఆర్ఎస్ఎమ్, శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ, పీజీ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో లోకమాత దేవి అహల్యబాయి హెూల్కర్ 300 వ జయంతి వేడుకలు ఘనంగా సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిటిడి బోర్డు సభ్యులు జి.భానుప్రకాష్ రెడ్డి, శ్యాంప్రసాద్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి. నారాయణమ్మ, అధ్యాపకులు, ఏ బి ఆర్ ఎస్ ఎం స్థానిక సభ్యులు, విద్యార్థినిలు పాల్గొన్నారు.

పరీక్షా సామగ్రి పంపిణీ

విద్యా సామగ్రి పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

ప్రజాశక్తి - రామచంద్రపురం: తిరుపతి జిల్లా, చంద్రగిరి నియోజకవర్గం, రామచంద్రపురం మండలంలోని 9 ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు వ్రాసే 350 మంది విద్యార్థులకు ఎమ్మెల్యే నాని ప్యాడ్లు, పెన్నులు, పెన్సిల్లు, స్కేళ్లు తదితర పరీక్షా సామాగ్రిని తన సొంత నిధులతో అందించారు.

నేడు సబ్సిడీ లోన్స్‌కు ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి -యర్రావారిపాలెం: మండలంలోని ఎంపీడీవో ఆఫీస్‌లో ఈరోజు బ్యాంకు రుణాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని ఎంపీడీవో అరుణ ఒక ప్రకటనలో తెలిపారు.

హిమబిందుకు అభినందన

ప్రజాశక్తి - రామచంద్రపురం (చంద్రగిరి) చంద్రగిరి మండలం పాకాల వారి పల్లికి చెందిన గుడి హిమబిందు కర్నూలు వైద్య కళాశాలలో రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంకు సాధించింది. ఆమెను కళాశాల అధ్యాపక బృందం ఆమెను అభినందించారు.

సమస్యలు పరిష్కరించండి

నిరసన తెలుపుతున్న విద్యార్థులు

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ఒప్పంద అధ్యాపకులుగా పనిచేస్తున్న అకాడమిక్ కన్సల్టెంట్ల పలు రకాల సమస్యలను పరిష్కరించాలని సోమవారం ఇన్చార్జి విసి ఆచార్య అప్పారావుకు ఆ సంఘం అధ్యక్షుడు రాంబాబు, అంజన్ సింగ్ ఆధ్వర్యంలో వినతిపత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నేతలు రవిబాబు, రంజిత్ సింగ్, తిమ్మప్ప, డబ్బుర రమణ, శరత్ బాబు తదితరులు ఉన్నారు.